


నాన్నగారు.. A Humble Colossus - త్రిపురనేని సాయిచంద్

*ప్రముఖ రచయిత స్వర్గీయ త్రిపురనేని గోపీచంద్ గారి గురించి వారి అబ్బాయి సాయిచంద్ గారు వ్రాసిన వ్యాసం. 'తెలుగు పలుకు' 17 వ తానా మహాసభల జ్ఞాపిక సంచిక నుంచి పునర్ముద్రణ*



నాన్నగారి గురించి నా మొదటి జ్ఞాపకం ఆయన మరణం గురించినదే. అప్పుడు నాకు నాలుగేళ్ళు. ఓ రోజు నేను, మా చిన్నక్క మా ఇంటికి ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుంటున్నాం. మా ఇంట్లోనుంచి పనిమనిషి బయటకు వచ్చి ' మీ నాన్న చనిపోయాడు' అని చెప్పింది. అప్పటివరకూ నాకు ఒక మనిషి చనిపోవడం అంటే ఏంటో తెలియదు. నేను, చిన్నక్క ఇంట్లోకి వెళ్ళాం. నాన్న భౌతికకాయం చుట్టూ జనాలు చేరి బిగ్గరగా ఏడుస్తున్నారు. నేను ఇంట్లోకి వెళ్ళగానే, 'అయ్యో సాయివచ్చాడం'టూ మరింత బిగ్గరగా ఏడ్చారు. బాల్యంలో అదే నా మొదటి జ్ఞాపకం. నా జీవితంలో నాన్న గూర్చి ఎక్కువ ప్రభావితం చూపించిన సంఘటన ఆయన మరణం.

నాన్నగారు ఓ కథ రాసినా తన చుట్టూ ఉన్న ప్రపంచానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయి. మా కుటుంబంలో ఎవరిదో ఒక పాత్ర అన్వయించబడి ఉంటుంది. అందుకే నాన్నగారి కథలలో ఆటోబయోగ్రాఫికల్ ఎలిమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. మా నాన్న సాహిత్యం చదవడం ఆసక్తి కలగటానికి కారణమైన సంఘటన ఒకటుంది. నేను చదివిన మొదటి కథ కన్నకూతురి కథ. అది మా తాత (అమ్మ తండ్రి) మీద రాసింది. ఆ కథ రాశాక మా ఇంట్లో పెద్ద గొడవే జరిగింది. మా తాత అలిగి వెళ్ళిపోయారు. అప్పుడు అసలు ఆ కథలో ఏముందో తెలుసు కోవాలనే ఆసక్తి కలిగింది. ప్రతి కథా ఏదో ఒక సన్నివేశానికి సంబంధించింది. అలాగే ఏదో ఒక రిఫరెన్సుతోనే కథలు చదివేవాడిని. చాల చిన్న వయస్సులోనే నేను నాన్నగారి సాహిత్యాన్ని చదవడం పూర్తిచేశాను. నాన్నగారు కాలం చేశాక నాలుగేళ్ళకు అమ్మ పోయింది. అప్పటి నుండి విజయవాడలో ఉన్న మామయ్య పాతూరి నాగభూషణంగారు (గ్రంధాలయ ఉద్యమ నాయకులు), మరికొంత మంది మిత్రులు కలిసి గోరాగారి పాఠశాలలో చేర్పించారు. అది గాంధేయ పద్ధతిలో నడపబడుతున్న పాఠశాల. అక్కడ నా ఆలోచనావిధానంలో ఎంతో మార్పు జరిగింది. ఆయన సామాజిక దృక్పథం నాకు వచ్చింది. అంతేకాకుండా ఆయన ఆచరించే ప్రతిపనీ నాన్నగారి కథల్లో తారసపడే పాత్రలలాగానే ఉండేవి. అక్కడ ఉన్న పెద్దలు కూడా నాన్నగారి సాహిత్యం గూర్చి ఎక్కువగా చర్చించేవాళ్ళు.

నేను 8వ తరగతి నుండి మెట్రిక్యులేషన్ దాకా అక్కడ చదివాను. ఆ స్కూలులో చేరడం నా జీవితంలో గొప్ప మలుపు. చేసి చెప్పే, చెప్పి చేసే గోరాగారి స్వభావం నాకు నచ్చింది. ఆయన ఏ పని చేసినా దానికి సంబంధించిన రిఫరెన్స్ నాకు నాన్నగారి కథలలో కనిపించేది. నాన్న కథలు కార్యశూరుడు, సరే కానివ్వండి, పేదవాళ్ళంతా ఒక్కటే, చీకటి గదుల్లో, గాంధీరామయ్య పాత్రగానీ - ఇవన్నీ

నాకు వారి సాహిత్యంలో కనిపించేవి. గోరాగారి దగ్గర నుండి నేను బెంగుళూరు వెళ్ళినా, సిన్మాలలో పనిచేసినా, గోపీచంద్‌గారి గూర్చి ఎవరో ఒకరు మాట్లాడటం, చర్చ చేయడం మూలాన చదివిన ప్రతిసారీ నాకు కొత్త పాయింట్ కనిపించేది.

ఈ రోజు కూడా నాన్నగారు నా పక్కన ఉన్నట్లు అనిపిస్తుంది. వారి రచనలలో నాకు బాగా నచ్చేది పాత్రలలో వైవిధ్యం చూపిన తీరు. పనిపిల్ల గురించి రాసినా, అరవిందుని గూర్చి రాసినా, కమ్యూనిస్టు కార్యకర్త గురించి రాసినా ఈ వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అదే విధానం నాకు షేక్స్పియర్‌లోనూ, సత్యజిత్ రేలోను కనిపిస్తుంది.

నేను ' మా భూమి' సినిమా చేస్తున్నప్పుడు అందరూ గోపీచంద్‌గారబ్బాయి చేస్తున్నాడు అని అనేవారు. అతి చిన్న వయసులోనే గౌతం ఘోష్, నర్సింగరావుగారలతో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. జీవితంలో నాకు లభించిన మంచి అవకాశం. నాకు చేతనైనంతగా ఎంతో డెడికేటెడ్‌గా చేశాను. దాదాపు ఆ సినిమా మొదలై విడుదలయ్యే నాటికి రెండు సంవత్సరాలు పట్టింది. ఆ రెండు సంవత్సరాలు ' మా భూమి' తో మమేకమై పనిచేశాను.

తాతగారి హేతువాద దృక్పథంగానీ, నాన్నగారి ఆధ్యాత్మిక ధోరణిగానీ, ఏదైనా, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని మాత్రమే రాశారు. అప్పటి నుండి నేను కూడా ఏ పని చేసినా దానికో సామాజిక ప్రయోజనం ఉండాలి అని నిర్ణయించుకున్నాను. మా భూమి నుండి అంకురం వరకూ సామాజిక దృష్టితో ఉన్న సినిమాలు మాత్రమే చేశాను. శివ, మంచుపల్లకి మినహాయిస్తే మిగతావన్నీ అలాంటివే. ఆ రోజుల్లో ఆర్.కె.నారాయణ్‌గారి మాల్గుడి డేస్‌ను శంకర్ నాగ్ గారు దూరదర్శన్‌కు చేశారు. అప్పుడు నేను నాన్న సాహిత్యం కూడా ఎంతో వైవిధ్యంతో ఉంది కదాని దూరదర్శన్‌లో మొదటి ప్రయత్నంగా, వారి చివరి నవల పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాను టెలిసీరియల్‌గా తీశాను. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది. నవలకు ఎంత పేరు వచ్చిందో సీరియల్‌కు కూడా అంతే పేరుతో బాటు అవార్డులు కూడా వచ్చాయి. ఆ తర్వాత నాన్నగారి కథలు గోపీచంద్‌కీ అమర్ కహానీ పేరుతో తీశాను. అంతేకాకుండా వారి మీద ఒక డాక్యుమెంటరీ తీశాను. దాన్ని సాహిత్యపరంగా, సినిమా పరంగా తీశాను. దానిలో ఎన్నో అరుదైన ఇంటర్వ్యూలు ఉన్నాయి. ఎల్.వి.ప్రసాద్ గారు ఆ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "గోపీచంద్ గారి దయవల్లనే నేను డైరెక్టర్‌ను అయ్యాను. దర్శకుడు కె.ఎస్.ప్రకాశ్‌గారు తీస్తున్న గృహప్రవేశంకు అసిస్టెంటు డైరెక్టరుగా నన్ను పిలిచారు. దానికి ముందుగా డైరెక్టర్ గోపీచంద్‌గారు అనుకున్నారు. నాతో మాట్లాడిన తర్వాత ఈ సినిమాకి ఎల్.వి.ప్రసాద్‌గారు డైరెక్టరు అయితే బాగుంటుంది అని నిర్మాతను ఒప్పించి మరీ, నాతో సినిమా చేశారు. ఆ విధంగా వారి పుణ్యం వల్లనే నేను డైరెక్టర్‌ను అయ్యాను," అని వినమ్రంగా చెప్పుకున్నారు.

గుమ్మడిగారికి, 'మీరు హీరో కంటే క్యారెక్టర్ యాక్టర్‌గా బాగా రాణిస్తారు', అని చెప్పారు నాన్నగారు. ఆయన ఆ తర్వాత ఎన్నో సినిమాలలో క్యారెక్టర్ యాక్టర్‌గా ప్రతిభావంతంగా పనిచేసిన విషయం తెలిసిందే ఆ సమయంలోనే నేను 'సినిమా సినిమా' అనే డాక్యుమెంటరీ తీశాను. ఎల్.వి.ప్రసాద్; కె.ఎస్.ప్రకాశరావు గారి లాంటివారితో చేసిన ఆ ఇంటర్వ్యూకు ఎంతో గుర్తింపు వచ్చింది. నాకు వృత్తిపరమైన సంతృప్తిని ఇవ్వడంతోపాటు నాన్నగారి సమకాలికులను కలిసే అదృష్టం కలిగింది.

నాకు చిన్నప్పటి నుండీ ప్రముఖ డాక్యుమెంటరీ డైరెక్టర్ సుఖదేవ్ అంటే చాలా ఇష్టం. నాకు సినిమాల్లో సత్యజిత్‌రే అంటే ఎంత ఇష్టమో సుఖదేవ్ అన్నా అంతే ఇష్టం. వారి లాగా సామాజిక దృక్పథం ఉన్న కథాంశంతో డాక్యుమెంటరీలు తీయాలని నిర్ణయించుకున్నాను. అప్పటి నుండి ఇప్పటివరకూ అదే ఒరవడిలో డాక్యుమెంటరీలు తీస్తున్నాను.

మా కుటుంబం గురించి చెప్పాలంటే మా తాత కవిరాజుగారు అప్పటికే ఒక ఉద్యమనేతగా పోరాడిన స్థితి న భూతో న భవిష్యతి. ఎంతో ధైర్యంగా ఒక ప్రత్యామ్నాయ సాంస్కృతిక వారసత్వ పునాది వేసిన మహానుభావుడాయన. నాకు తెలిసి నాన్నగారు తాతగారి భుజాల నెక్కి ప్రపంచాన్ని చూశారు. అందుకే నాన్నగారికి అంత వైవిధ్యమైన దృష్టి, ఒరవడి అలవడ్డాయి.

తాతగారిలో ఎన్నో వైవిధ్యాలు మనం గమనించవచ్చు. వారు హేతువాదులై ఉండీ ఎంతోమంది సనాతనులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ఆ క్రమంలోనే వారికి ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులుగారితో సాన్నిహిత్యం ఏర్పడింది. వారు ఇంటికి వస్తూపోతూ ఉండేవారు. ఉన్నవగారి పరిచయంతోనే తనలో ఆధ్యాత్మిక ధోరణులు అంకురించాయని నాన్నగారు చెప్పుకునేవారు. అప్పటినుండే నాన్నగారి సొంత నడక మొదలైంది. ఉన్నవ, ఎం.ఎన్.రాయ్, అరవిందుని ప్రభావం వారిమీద ఉండేవి. ఇప్పటికీ వారిదో అద్భుతమైన ప్రయాణం. ఆ క్రమంలో వారు ఎంతోమందికి చేయూత నిచ్చారు.

నాన్నగారు మా తాతగారిలాగానే నాస్తికులై ఉంటే ఇంక దీంట్లో మాట్లాడటానికి ఏముండేది. తండ్రి నాస్తికుడు కాబట్టి అతడు నాస్తికుడు అయ్యాడు అనుకునేవారు...

వారిలో నాకు బాగా నచ్చింది నిజాయితీ. ఆ క్రమంలో వారు సొంత మనుషుల మీద కూడా రాయడానికి వెనుకాడలేదు. వారి చివరి నవల పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాలో పాత్రలన్నీ తెనాలిలో తన సన్నిహిత మిత్రుల హిపోక్రసీ మీదనే రాశారు. వారు ఎవరి మెప్పుకోసం రాయలేదు.

హి ఈజ్ ఎ రియల్ థింకర్, రియల్ ఫిలాసపర్.

మా బాబాయి కుల్‌చంద్‌గారు కూడా రాశారు. వారు రాసిన 'కరువు రోజుల్లో' అనే నాటకంలో ఎన్టీఆర్, జి. వరలక్ష్మి. నిర్మలమ్మలాంటి హేమాహేమీలు నటించారు. ఆ తర్వాత ఎందుకో వారు రాయలేదు. మా పెద్దన్నయ్య డాక్టర్ రమేష్ కూడా నాటికలు, నాటకాలు రాశారు. వారు మానవత్వం, కుక్కలున్నాయి జాగ్రత్త, శవ కళ్యాణం, మనకికలేరు, దిష్టిబొమ్మలులాంటివి రాశారు. ఆ రోజుల్లో 'మానవత్వం' దర్శకులు టి.కృష్ణ, రావుగోపాలరావులాంటివారు బాగా ఇష్టపడ్డ నాటిక. ఆ తర్వాత వారు ఇంగ్లండ్ వెళ్ళారు. రాయడం మానేశారు. మా రెండో అన్నయ్య, చిన్నక్క కూడా కొన్ని కథలు రాశారు. నా కెందుకో రాయడం అబ్బలేదు. ఎప్పుడూ రాయాలని కూడా ప్రయత్నించలేదు.

ఇంతకుముందే చెప్పాను, తాతగారికి ఉన్నవగారికి మంచి సంబంధాలు ఉండేవని. ఉన్నవగారు నడుపుతున్న 'శారదా నికేతన్'లో అమ్మ చదువుకున్నారు. ఆ పరిచయమే అమ్మకు, నాన్నకు పెళ్ళి జరిగేందుకు దోహదపడింది. వారు ఏ కథ రాసినా మొదటి శ్రోత, విమర్శకురాలు అమ్మ మాత్రమే. చాలా వరకు నాన్న చెబుతుంటే అమ్మ రాస్తూ ఉండేది. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళల్లో అలానే ఉండిపోయింది. ఆ దృశ్యాన్నే యధాతథంగా నా పరమేశ్వరశాస్త్రి వీలునామా టెలిఫిల్మ్ ప్రారంభ సన్నివేశంగా చిత్రీకరించాను.

నాన్నగారు పోయాక అమ్మ ఎప్పుడూ ఏడుస్తూ ఉండేది. వారు పోయాక తనూ ఎంతోకాలం బ్రతకలేదు. అమ్మా, నాన్న రమేష్ అన్నయ్య నా బాల్యం మీద చెరగని ముద్ర వేశారు.

చివరగా మీతో ఒక మాట చెప్పాలని ఉంది. నాకు జన్మల మీద నమ్మకం లేదు. అయినప్పటికీ, జన్మంటూ ఉంటే మళ్ళీ మళ్ళీ గోపీచంద్‌గారి అబ్బాయిగానే పుట్టాలని కోరుకుంటున్నాను.

✡ ✡ ✡